తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 2 - జూన్ - 2026 | సంపుటి : 3 | సంచిక : 365 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం



**కొత్తగూడలో సీఎం సందేశం.. పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి**

**లక్ష ఇళ్ల గృహప్రవేశాలకు శ్రీకారం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**కొమురంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆదివాసీ కుటుంబాల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకు రావాలంటే పిల్లలను తప్పనిసరిగా చదివించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కొఠారి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలోని సిడం కన్నీబాయి, టెకం పగ్గుబాయి, ఆత్రం పోచుబాయిల కొత్త ఇళ్లను కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించి గృహప్రవేశాలు నిర్వహించారు. నూతన సాంకేతికతతో నిర్మించిన ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ మహిళలతో జరిగిన ముఖాముఖి సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి వంటి సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. అయితే ప్రతిఫలంగా తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని కోరారు. ఒక పూట ఉపవాసం ఉన్నా సరే పిల్లల చదువును ఆపొద్దని విజ్ఞప్తి చేశారు. చదువే జీవితాలను మార్చగల శక్తి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విద్య ద్వారా మాత్రమే పేదరికం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని, ఆదివాసీ కుటుంబాల భవిష్యత్తు పిల్లల విద్యపైనే ఆధారపడి ఉందని వివరించారు. మహిళల నుంచి పిల్లలను చదివిస్తామని మాట తీసుకున్నారు.

మిగతా 2లో..

## ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

**రైతులకు సీఎం భరోసా**

**ధాన్యం కొనుగోలుపై స్పష్టత**

**తుమ్మిడిహెట్టిపై కేంద్రానికి విజ్ఞప్తి**

2లో



## ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల

- గుడిసెలు లేని తెలంగాణ.. ప్రభుత్వ సంకల్పం
- మంథనిలో గృహ ప్రవేశాలు.. లబ్ధిదారుల్లో ఆనందం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**మంథని, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆ ఆశయ సాధనలో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఆయన వెల్లడించారు. సోమవారం మంథని నియోజకవర్గంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త ఇళ్లలోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులను అభినందిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు నిజమైన

మిగతా 2లో..



## బీజేపీ అధికారంలోకి రాదు

- మఖ్దూం భవన్‌లో కౌన్సిల్ సమావేశం
- ప్రజా సమస్యలపై పోరాటాలకు పిలుపు
- ఎన్నికలకు పార్టీ సన్నద్ధం
- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**మంథని, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం అసాధ్యమని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ మతపరమైన విభజన రాజకీయాలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. మతాన్ని ఆధారంగా చేసుకుని రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ

మిగతా 2లో..



## రైతులకు సాగునీరు లక్ష్యం : మంత్రి తుమ్మల

**మారెళ్లపాడు పనులు వేగవంతం**

**జూలైలోపు పూర్తి చేయాలి.. క్షేత్రస్థాయిలో మంత్రి సమీక్ష**

2లో



## ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం

- ప్రభుత్వంపై బీజేపీ విమర్శలు
- రైతుల ఇబ్బందులపై ఆందోళన
- తక్షణ కొనుగోళ్లకు డిమాండ్

**న్యూఢిల్లీ, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. ఢిల్లీలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రైస్ మిల్లర్లతో కుమ్మక్కై రైతుల ప్రయోజనాలను విస్మరించిందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీని అమలు చేయడంలో విఫలమైందని

మిగతా 2లో..



## ఉద్యోగుల ఆరోగ్య పథకానికి ట్రస్ట్

- ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు నిర్ణయం
- ఉద్యోగుల సూచనలకు ప్రాధాన్యం
- మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

**హైదరాబాద్, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలును ప్రత్యేక ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ద్వారా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వెల్లడించారు. సచివాలయంలో సోమవారం సంయుక్త సిబ్బంది మండలి సభ్యులు, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, పెన్షనర్లు, వారి ఆధారిత కుటుంబ సభ్యులకు అందుతున్న

మిగతా 2లో..



## తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే లక్ష్యం

- ఉద్యమకారుల రౌండ్ టేబుల్
- కవిత ఘాటు వ్యాఖ్యలు
- హామీల అమలుపై డిమాండ్

**హైదరాబాద్, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు - సాధన అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘాలు, అమరవీరుల కుటుంబ సభ్యుల సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వం, హక్కుల పరిరక్షణ కోసమే తమ పార్టీ పనిచేస్తోందని అన్నారు.

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రైతులకు సాగునీరు లక్ష్యం : మంత్రి తుమ్మల

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను జూలై నెలాఖరులోపు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆయన ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జూన్ నాటికి పూర్తికావాల్సిన పనులు ఇంకా పూర్తి కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలస్యానికి గల కారణాలను తెలుసుకుని పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం అత్యంత అవసరమన్నారు. పినపాక నియోజకవర్గ రైతులే సీతారామ ఎత్తిపోతల పథకం కోసం మొదటగా భూములు ఇచ్చారని గుర్తు చేసిన మంత్రి, ఈ ప్రాజెక్టు ఫలాలు కూడా ముందుగా ఆ ప్రాంత రైతులకే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సాగునీటి వసతుల విస్తరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఇప్పటివరకు రూ.10 వేల కోట్లు వ్యయం చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి ప్రయోజనాలు అందించేందుకు మరో రూ.9 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని చెప్పారు. ఇప్పటికే పంపిణీ కాలువల నిర్మాణం కోసం రూ.4 వేల కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే వచ్చే ఏడాది నాటికి పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతుల కోసం కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. వర్షాకాలానికి ముందే ప్రధాన కాలువను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో అమరవీరులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ వారి కుటుంబాలకు ఇప్పటికీ పూర్తి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ఉద్యమం దేశవ్యాప్తంగా ఆదర్శవంతమైన ప్రజా ఉద్యమంగా నిలిచిందని కవిత పేర్కొన్నారు. వంటావార్పు, సకల జనుల సమ్మె వంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణ ఆకాంక్షలను ప్రజల్లోకి తీసుకెళ్లామని చెప్పారు. ఉద్యమ సమయంలో ప్రజల మధ్య విభేదాలు సృష్టించకుండా తమ హక్కుల కోసం పోరాటం చేశామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయ నాయకులపై, అక్కడి రాజకీయ పరిణామాలపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర రాజకీయాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నాలను తెలంగాణ ప్రజలు సహించరని స్పష్టం చేశారు. తెలంగాణలో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్ ప్రజలతో తమకు ఎలాంటి విభేదాలు లేవని, వారిని గౌరవిస్తామని చెప్పారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చలేదని కవిత విమర్శించారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. భవిష్యత్ తెలంగాణ నిర్మాణానికి సంబంధించి రైతులు, యువత, సామాజిక న్యాయం అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కవిత పేర్కొన్నారు. రైతు సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, సామాజిక తెలంగాణ నిర్మాణం తమ లక్ష్యాలని తెలిపారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిపై ప్రజలు, ఉద్యమకారులు సూచనలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# ఉద్యోగుల ఆరోగ్య పథకానికి ట్రస్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసి సులభతరం చేయడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు పొందేలా బలమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం వచ్చే కొద్ది రోజుల్లో ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ట్రస్ట్ నిర్వహణకు సంబంధించి ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం, ఉద్యోగులు సమానంగా ఆర్థిక సహకారం అందించే విధంగా ట్రస్ట్ పనిచేస్తుందని పేర్కొన్నారు. లబ్ధిదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ట్రస్ట్ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అధికారం కలిగి ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాల ప్రతినిధులు చేసిన సూచనలు, సిఫారసులను పరిశీలించి ట్రస్ట్ నిర్వహణ మార్గదర్శకాలను రూపొందిస్తామని రామకృష్ణారావు తెలిపారు. పాలన వ్యవస్థ, ఆర్థిక నిర్వహణ, సేవల అందజేత విధానం, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వంటి అంశాలపై ఉద్యోగ సంఘాలు పలు సూచనలు చేసినట్లు చెప్పారు. ఈ నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు స్వాగతించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ఇది కీలక ముందడుగుగా అభివర్ణించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు బెన్‌హర్ మహేష్ ఎక్కా, దాన కిషోర్, పలువురు ప్రధాన కార్యదర్శులు, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లకు మరింత సమర్థవంతమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు.

# ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా రెండో విడతగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని కూడా కొత్తగూడ నుంచే ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. గూడాలు, తండాలు, ఐటీడీఏ ప్రాంతాల్లో నివసించే ప్రతి అర్హ కుటుంబానికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో గుడిసెలు లేని తెలంగాణను నిర్మించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు మధ్యలో ఆపకుండా పూర్తి చేయాలని సూచించిన ముఖ్యమంత్రి, మహిళా సంఘాలకు అందించే రుణ పరిమితిని పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, వివేక్ వెంకటస్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

**కొమురంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, తడిసిన ధాన్యానికి కూడా కనీస మద్దతు ధర అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ముఖ్యమంత్రి విమర్శించారు. కేవలం మద్దతు ధర ప్రకటించడం సరిపోదని, రాష్ట్రాల్లో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం కూడా కేంద్రం బాధ్యత అని అన్నారు. ఇతర రాష్ట్రాలకు ఇచ్చే ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, మొత్తం 75 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయనున్నామని తెలిపారు.

రైతులు అధైర్యపడవద్దని, కొనుగోలు ప్రక్రియలో రెండు రోజులు ఆలస్యం జరిగినా ప్రతి గింజను కొనుగోలు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పండిన మొక్కజొన్న, జొన్నలు, పొద్దుతిరుగుడు వంటి పంటలను కూడా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఏడాది కాలంగా చర్చలకు ప్రయత్నిస్తున్నప్పటికీ స్పందన రావడం లేదని అన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. మహారాష్ట్రతో సమస్యలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటోందని సీఎం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో మధ్యవర్తిత్వం వహించి పరిష్కారానికి దోహదపడాలని కోరారు. తెలంగాణ పట్ల వివక్ష కొనసాగితే తదుపరి కార్యాచరణను జూన్ 15 తర్వాత ప్రకటిస్తామని హెచ్చరించారు. సభలో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని గూడాలు, తండాల్లో గుడిసెలు లేకుండా చేయడమే లక్ష్యమని చెప్పారు. ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, రెండో విడతగా మరో రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, వివేక్ వెంకటస్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల

(మొదటి పేజీ తరువాయి)

అర్హులకు చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా సొంతింటి కోసం ఎదురుచూసిన పేద కుటుంబాల కలలు నెరవేరడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని మంత్రి పేర్కొన్నారు. కొత్త ఇళ్లలోకి ప్రవేశిస్తున్న కుటుంబాల కళ్లల్లో కనిపించిన సంతోషం తనకు ప్రత్యేక సంతృప్తిని ఇచ్చిందన్నారు.

పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో గృహ నిర్మాణ పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. ప్రతి కుటుంబానికి సురక్షితమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలకు స్థిరమైన నివాస వసతి అందుబాటులోకి వస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములకు మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సొంతింటి కల సాకారం కావడం ప్రతి కుటుంబ జీవితంలో ఒక మధురమైన ఘట్టమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు. గుడిసెలు లేని తెలంగాణ లక్ష్య సాధన దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# బీజేపీ అధికారంలోకి రాదు

(మొదటి పేజీ తరువాయి)

దండయాత్ర, జైత్రయాత్ర చేయబోతోందంటూ ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని కూనంనేని అన్నారు. అయితే రాష్ట్రంలో కొన్ని స్థానాలు గెలిచే అవకాశం ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. ప్రజలు ప్రస్తుతం అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దేశవ్యాప్తంగా ప్రభుత్వాలపై అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో సీపీఐ శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రత్యామ్నాయ రాజకీయాలకు బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి పార్టీ వ్యూహాన్ని కూడా ఆయన వివరించారు. పొత్తులు కుదిరితే కనీసం ఐదు స్థానాల్లో, పొత్తులు లేకపోతే కనీసం పదిహేను నియోజకవర్గాల్లో పోటీ చేసేలా పార్టీ సిద్ధం కావాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బలమైన నలభై నియోజకవర్గాలను గుర్తించినట్లు వెల్లడించారు.

ఈ నియోజకవర్గాల్లో ఆగస్టు 6 నుంచి 15 వరకు ప్రత్యేక పాదయాత్రలు నిర్వహించనున్నట్లు కూనంనేని ప్రకటించారు. ఈ యాత్రల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు స్థానిక సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తామని చెప్పారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు. అలాగే ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై జరుగుతున్న వేధింపులకు నిరసనగా జూన్ 4న ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ అంశంపై జూన్ 15న రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. సెప్టెంబర్ 28న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావిస్తామని కూనంనేని సాంబశివరావు తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం

(మొదటి పేజీ తరువాయి)

రాంచందర్ రావు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపైనే ధాన్యం కుప్పలుగా పేరుకుపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కావాలనే కొనుగోళ్లను ఆలస్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. దిగుబడులకు సంబంధించిన సరైన గణాంకాలను కేంద్రానికి పంపడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రాలు సేకరించిన ధాన్యానికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం నిధులు తిరిగి చెల్లిస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ధాన్యం తరలింపులో జరుగుతున్న జాప్యంపై బీజేపీ ఇప్పటికే పలు ఆందోళనలు నిర్వహించిందని రాంచందర్ రావు గుర్తుచేశారు. బీజేపీ నిరంతర పోరాటాలు, నిరసనల కారణంగానే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపించాల్సి వచ్చిందని అన్నారు. ప్రతిపక్ష ఒత్తిడి వల్లే ప్రభుత్వం స్పందించిందని వ్యాఖ్యానించారు. రైతుల వద్ద మిగిలి ఉన్న ప్రతి ధాన్యం గింజను ఎలాంటి జాప్యం లేకుండా యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కొనుగోలు, రవాణా, చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జూన్ 2న ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాంచందర్ రావు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ నాయకత్వంతో పాటు పలువురు కేంద్ర నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

## సోషల్ మీడియా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**హైదరాబాద్, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** సోషల్ మీడియా వేదికలను ఉపయోగించి జరుగుతున్న పెట్టుబడి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. తక్కువ సమయంలో భారీ లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ట్రేడింగ్, పెట్టుబడులు, ఆన్‌లైన్ ఆదాయ అవకాశాల పేరుతో నిర్వహిస్తున్న మోసాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పోలీసుల వివరాల ప్రకారం సామాజిక మాధ్యమాల్లో కనిపించే ట్రేడింగ్ ప్రకటనలు, పెట్టుబడి సలహాలు, ఆకర్షణీయ ఆఫర్లను నమ్మి డబ్బులు పెట్టుబడి పెట్టడం ప్రమాదకరమని తెలిపారు. వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో చేర్చి ప్రత్యేక ట్రేడింగ్ చిట్కాలు ఇస్తామంటూ మోసగాళ్లు వల వేస్తున్నారని హెచ్చరించారు. మొదట కొంత లాభం చూపించి తర్వాత పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టించే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. నకిలీ వెబ్‌సైట్లు, మొబైల్ అనువర్తనాల ద్వారా ప్రజలను ఆకర్షించి వారి సొమ్మును దోచుకుంటున్నారని పోలీసులు పేర్కొన్నారు. పెట్టుబడులు పెడితే కొద్ది రోజుల్లోనే రెట్టింపు, మూడింతలు లాభాలు వస్తాయని చెప్పే ప్రకటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచించారు. ఎలాంటి ఆర్థిక లావాదేవీలు చేసే ముందు సంబంధిత సంస్థ విశ్వసనీయతను పూర్తిగా పరిశీలించాలని తెలిపారు. ప్రత్యేకంగా అపరిచిత వ్యక్తుల సూచనల మేరకు పెట్టుబడులు పెట్టకూడదని, వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, ఇతర గోప్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని పోలీసులు హెచ్చరించారు. పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చినప్పుడు అధికారిక వనరుల ద్వారా నిజానిజాలు నిర్ధారించుకోవాలని సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# హనుమకొండకు బదిలీ నేపథ్యంలో వెటర్నరీ డాక్టర్ మాలతికి ఆత్మీయ వీడ్కోలు



- 8 ఏళ్ల సేవలకు గుర్తింపుగా ఘన సన్మానం

**భీమదేవరపల్లి, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో గత 8 సంవత్సరాలుగా పశువైద్య అధికారిణిగా సేవలందించిన డాక్టర్ మాలతి హనుమకొండకు బదిలీ కావడంతో ఆమెకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా కొప్పూరు గ్రామ సర్పంచ్ గద్ద కుమారస్వామి, ఉప సర్పంచ్ మిరియాల రాణిరాజు, రైతులు, ప్రజాప్రతినిధులు కలిసి డాక్టర్ మాలతిని శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. పశుసంవర్ధక రంగ అభివృద్ధికి ఆమె అందించిన సేవలను కొనియాడుతూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. డాక్టర్ మాలతి మాట్లాడుతూ, భీమదేవరపల్లి మండల రైతులు, ప్రజలు తనకు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన కాలం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, పశుపోషకులు, గ్రామ పెద్దలు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతుల రాకపోకలకు ఆటంకం వద్దు.. అధికారులకు మున్సిపల్ చైర్మన్ సూచన



**జమ్మికుంట టౌన్ జూన్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ పరిధిలోని ధర్మారం శివారు కొత్తపల్లి సబ్ స్టేషన్ నుంచి రామన్నపల్లి రైతులు వ్యవసాయ పనుల కోసం వినియోగించే రహదారిపై నెలకొన్న వివాదాన్ని పరిష్కరించేందుకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ స్థానిక ఎంఆర్వోతో కలిసి స్థలాన్ని పరిశీలించారు.
కొత్తపల్లి సబ్ స్టేషన్ పరిసరాల్లో ఎన్పీడీసీఎల్ అధికారులు గోడ నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో రైతులు తమకు ఉపయోగపడే రహదారి మూసివేయబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ వెంటనే అధికారులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివాదాస్పద స్థలం రైతుల రహదారికి సంబంధించినదా లేదా ఎన్పీడీసీఎల్ పరిధిలోనిదా అనే అంశాన్ని అధికారులు స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. రైతులకు చెందిన రహదారి అయితే ఎన్పీడీసీఎల్ అధికారులు వెనక్కి తగ్గాలని, ఒకవేళ సంస్థకు సంబంధించిన స్థలం అయితే రైతులకు ప్రత్యామ్నాయ మార్గం కల్పించేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రామన్నపల్లి రైతులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్రలో టీఆర్పీకి భారీ చేరికలు.. పలువురికి కీలక పదవులు



**దేవరకద్ర,జూన్01(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) బలోపేతానికి దేవరకద్ర నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని నియోజకవర్గ ఇంచార్జ్ మంగరాయి వెంకటేష్ అన్నారు.తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మున్నూరు జయపాల్ మార్గదర్శకంలో దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జ్ మంగరాయి వెంకటేష్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా టీఆర్పీ కార్యాలయంలో పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీఆర్పీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి జిల్లా అధ్యక్షుడు మున్నూరు జయపాల్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మండల ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ యాదవ్, మండల ఉపాధ్యక్షుడిగా ఏలసరి ఆంజనేయులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా వెంకటయ్యకు నియామక పత్రాలను అందజేశారు. పార్టీ బలోపేతం కోసం అంకితభావంతో పనిచేసి, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని నూతనంగా నియమితులైన నాయకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షుడు రవికుమార్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు నజీర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన జాగృతి పోలీస్ కళా బృందం



**వేలేరు, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జాగృతి పోలీస్ కళా బృందం ఆదివారం రాత్రి వేలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బండతండా గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. రాత్రి 7.00 గంటల నుంచి 9.30 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఉంటే 8712584473 నంబర్‌కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అలాగే విద్య ప్రాధాన్యత, రోడ్డు భద్రత, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, డయల్ 100 సేవలు, సీసీటీవీ కెమెరాల ఉపయోగం, వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ, మూఢనమ్మకాల నిర్మూలన తదితర అంశాలపై పాటలు, మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించారు.
సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ వల్ల కలిగే నష్టాలపై నాటికల ద్వారా వివరించి, సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వేలేరు ఎస్సై సురేష్, గ్రామ సర్పంచ్ మాలోతు అరుణ, మహిళా ఏఎస్ఐ నాగమణి, హెడ్ కానిస్టేబుళ్లు విలియం, రత్నయ్య, పూల్ సింగ్, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు, చిరంజీవి, ఇతర పోలీసు సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎంపీడివో కార్యాలయం ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా



**హుజూరాబాద్, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హుజూరాబాద్‌లోని ఎంపీటీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ హుజూరాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లను వినిపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ కార్మికులకు గత ఎనిమిది సంవత్సరాలుగా వేతనాలు పెంచకపోవడంతో జీవనోపాధి కష్టతరంగా మారిందన్నారు. ప్రస్తుతం రూ.9,500 వేతనంతో కుటుంబాలను పోషించడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనాన్ని రూ.26,000లకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి, మెటీరియల్ సరఫరాదారులకు చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు, వారి పిల్లలకు విద్యా, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని సమావేశంలో తీర్మానించారు. ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని



**హుజూరాబాద్, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం కింద హుజూరాబాద్ మున్సిపాలిటీ 13వ వార్డులో లబ్ధిదారులు కొలుగూరి సునీతరవికుమార్ దంపతుల నూతన గృహాన్ని సోమవారం ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, స్థానిక 13వ వార్డు కౌన్సిలర్ సందమల్ల పుణ్యబాబు పాల్గొని గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో స్థానికంగా ఈ గృహాన్ని ప్రారంభించినట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ కిషన్ హాజరయ్యారు. అలాగే మున్సిపల్ మేనేజర్ భూపాల్ రెడ్డి, హౌసింగ్ ఏఈ రోజా, కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగా అనిల్, కొలుగూరి సమ్మయ్య, కొయ్యడ రాజేష్, మహేందర్, కుక్కమూడి మొగిలి తదితరులు పాల్గొన్నారు. వార్డు ప్రజల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇల్లు పథకం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలి

- ఖరీఫ్‌కు ఉచిత విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని ఏఐయుకేఎస్ డిమాండ్.




**దమ్మపేట, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను ఉచితంగా అందించడంతో పాటు పాత వ్యవసాయ రుణాలను రద్దు చేసి, వడ్డీ లేని కొత్త రుణాలు మంజూరు చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము మాట్లాడుతూ రైతాంగానికి అవసరమైన వ్యవసాయ పనిముట్లను సగం సబ్సిడీపై ప్రభుత్వం అందించాలని కోరారు. పంటలకు కనీస మద్దతు ధరలు నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కల్తీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాలను అరికట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన అరటి, మామిడి తదితర పంటలకు వెంటనే నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరలు నిరంతరం పెరుగుతుండడం ప్రజలపై అదనపు భారం మోపుతోందన్నారు. రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతులకు పూర్తి రుణమాఫీ చేసి, వడ్డీ లేని కొత్త రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. భూమిలేని పేదలకు భూమి, ఇల్లు లేనివారికి ఇల్లు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. వ్యవసాయాన్ని విదేశీ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను నిలిపివేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో పాల్వంచ డివిజన్ అధ్యక్షుడు పదూరి వీరబాబు, మండల అధ్యక్షుడు కుంజ కాంతారావు, తామ రాముడు, కుంజ పాపారావు, తెల్లం నాగేష్, వాడే గిరి, చాప ముత్యాలరావు, ఊకే మహేష్, కేసరి వెంకటేష్, ప్రసాద్, శీలం రాజు, కుంజ రవి, ధారబోయిన మంగ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధే లక్ష్యం.. డ్రైనేజీ నిర్మాణ పనులకు సర్పంచ్ చంద్రశేఖర్ శ్రీకారం

**పెద్దమందడి,జూన్01( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 7వ వార్డులో అండర్ మరియు ఓపెన్ డ్రైనేజీల ఏర్పాటు పనులకు గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడం లక్ష్యంగా ఈ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ చంద్రశేఖర్ తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు గ్రామ పంచాయతీ నిరంతరం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ యాదవ్, 2వ వార్డు సభ్యుడు సింగం కృష్ణయ్య, రగ్మా రెడ్డి, సాయి రెడ్డి, డి. కురుమన్న, కురుమన్న, మన్యం, ధనంజేయ, రవికుమార్, రాములు, నరసింహ, అంజి, కురుమూర్తి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సర్టిఫికెట్ల జాప్యంపై ఆందోళన.. తహసీల్దార్ కార్యాలయానికి వినతిపత్రం



**జమ్మికుంట టౌన్ జూన్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** ఉన్నత విద్య, స్కాలర్‌షిప్‌లు, కౌన్సెలింగ్ కోసం అవసరమైన సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థులకు నిర్ణీత సమయంలో సర్టిఫికెట్లు అందించాలని కోరుతూ జమ్మికుంట తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కీర్తికి వినతిపత్రం అందజేశారు.
జమ్మికుంట మండలానికి చెందిన పలువురు విద్యార్థులు వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, గత కొన్ని రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లు సమయానికి అందుబాటులో లేకపోవడంతో సర్టిఫికెట్ల జారీ ఆలస్యమవుతోందని, దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో వివరించారు.
విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొండపర్తి ప్రవీణ్, మహమ్మద్ అహ్మద్ పాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పొదుపు మనిషికి ఆర్థిక స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని అందిస్తుంది





- కంచెర్ల కృష్ణమూర్తి

**ఎల్కతుర్తి, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండల పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడిగా కంచెర్ల కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా జనగాని సుభాష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులను సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కంచెర్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ, "పొదుపు మనిషికి ఆర్థిక స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని అందిస్తుంది" అని అన్నారు. ప్రతి వ్యక్తి తన ఆదాయంలో కొంత భాగాన్ని క్రమం తప్పకుండా పొదుపు చేయడం ద్వారా ఆర్థికంగా బలపడటమే కాకుండా, అత్యవసర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే స్థాయికి చేరుకుంటాడని పేర్కొన్నారు.
పొదుపు అనేది కేవలం డబ్బును దాచుకోవడం మాత్రమే కాదని, కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించే మంచి అలవాటు అని తెలిపారు. సమితి ద్వారా సభ్యుల్లో పొదుపుపై మరింత అవగాహన కల్పించడంతో పాటు, వారి ఆర్థికాభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.
సభ్యుల ఐక్యత, క్రమశిక్షణ, పరస్పర సహకారంతో సమితిని మరింత బలోపేతం చేసి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, అందరి సహకారంతో సమితిని ఆదర్శవంతమైన స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని కంచెర్ల కృష్ణమూర్తి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, ప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# "ప్రశ్నించడం నేరం కాదు.. జవాబుదారీతనమే నిజమైన నాయకత్వం"



**జమ్మికుంట టౌన్ జూన్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సమస్యలపై ప్రశ్నించడం భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని పలువురు ప్రజాస్వామ్యవాదులు అభిప్రాయపడ్డారు.
ప్రజల సమస్యలను ప్రస్తావిస్తూ ప్రశ్నించే వారిని అణచివేయడం లేదా బెదిరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వారు పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని, హోదాలు ఉన్నాయని ప్రజల ప్రశ్నలను నిర్లక్ష్యం చేయడం లేదా అహంకారపూరిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సూచించారు.
ప్రజల డబ్బు, ప్రజల హక్కులు, ప్రజా సమస్యలకు సంబంధించిన అంశాలపై ప్రశ్నించడం ప్రతి బాధ్యతగల పౌరుడి హక్కు మాత్రమే కాకుండా కర్తవ్యమని పేర్కొన్నారు. అధికార పార్టీ, ప్రతిపక్షం, ప్రజాప్రతినిధి లేదా అధికారి అనే తేడా లేకుండా తప్పులను ప్రశ్నించే సంస్కృతి బలపడాలని కోరారు.
ప్రజా సమస్యల కోసం పోరాడే వ్యక్తులకు భరోసా కల్పించి, వారి ఆందోళనలను వినాల్సిన బాధ్యత పాలకులపై ఉందని తెలిపారు. సమస్యలకు సమాధానాలు చెప్పాల్సిన వారు బెదిరింపులకు పాల్పడితే ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని అభిప్రాయపడ్డారు.
ఒక వ్యక్తిని మౌనం చేయవచ్చేమో కానీ ప్రజల గొంతును ఎప్పటికీ మౌనం చేయలేరని పేర్కొంటూ, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదని, ప్రశ్నించకపోవడమే సమాజానికి ప్రమాదమని స్పష్టం చేశారు. ప్రజల కోసం మాట్లాడే ప్రతి గొంతుకకు మద్దతు ఉంటుందని, బెదిరింపుల రాజకీయాలు కాకుండా సమస్యల పరిష్కారమే సమాజానికి అవసరమని తెలిపారు.

# అమ్మపల్లిలో విషాదం.. ఎద్దుల బండి ప్రమాదంలో 12 ఏళ్ల బాలుడు మృతి



**పెద్దమందడి,జూన్01(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన దేసు సాత్విక్ (12) ఎద్దుల బండిపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడటంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, సాత్విక్ ఎద్దుల బండిపై ప్రయాణిస్తుండగా అదుపు తప్పి కిందపడినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలుడి అకాల మరణంతో అమ్మపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.గ్రామస్థులు సాత్విక్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వేలేరు – హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్ ప్రారంభం





**వేలేరు, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలో వేలేరు నుండి హైదరాబాద్‌కు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌ను ఎమ్మెల్యే కడియం శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రయాణికులు ఈ కొత్త బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ద్వారా మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత ప్రయాణ సదుపాయాన్ని పొందవచ్చని తెలిపారు .ఈ సందర్భంగా వేలేరు మేజర్ గ్రామ సర్పంచ్ బిల్లా యాదగిరి, పెద్దపెండ్యాల గ్రామ సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ, వేలేరు మరియు ధర్మసాగర్ మండలాల ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని నూతన బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో డిపో మేనేజర్, తహసీల్దార్, ఎంపీడీవో, ఏఓతో పాటు సర్పంచులు అశోక్, మనోజ్, శ్రీనివాస్, సాంబయ్య, కిరణ్, రాజు, అరుణ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంపత్, మల్లికార్జున్, రామ్‌రెడ్డి, లక్ష్మణ్ నాయక్, రాజిరెడ్డి, రవీందర్ యాదవ్, ఉప సర్పంచులు శ్రీకర్, రమేష్ మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు.. అనుమానితులపై పోలీసుల ప్రత్యేక నిఘా





**జమ్మికుంట టౌన్ జూన్ 01 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో పోలీసులు విస్తృత స్థాయిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రవి, పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం సహాయంతో రైల్వే స్టేషన్ ప్రాంగణం, ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల సామాన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. రైల్వే మార్గాల ద్వారా మాదక ద్రవ్యాల రవాణా జరిగే అవకాశాల నేపథ్యంలో అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, ఎవరైనా మత్తు పదార్థాల విక్రయం లేదా రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజల సహకారంతోనే మాదక ద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని, జిల్లాలో డ్రగ్స్ రహిత సమాజం లక్ష్యంగా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక విచారణ

- సిట్ ఎదుట ఇద్దరు ఎమ్మెల్యేలు
- ఆరోపణలపై వివరాల సేకరణ
- రాజకీయంగా ఆసక్తికర పరిణామం



**హైదరాబాద్, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, జనగామ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సోమవారం ప్రత్యేక విచారణ బృందం (సిట్) ఎదుట హాజరయ్యారు. గత ప్రభుత్వ హయాంలో తమ ఫోన్లు అక్రమంగా ట్యాపింగ్‌కు గురయ్యాయని వారు చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు వారి నుంచి వివరాలు సేకరించారు. ఫిర్యాదుల ఆధారంగా ఇప్పటికే దర్యాప్తు కొనసాగిస్తున్న సిట్ అధికారులు, చట్టపరమైన నిబంధనల మేరకు నోటీసులు జారీ చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఎమ్మెల్యేలను పిలిపించారు. ఈ సందర్భంగా ట్యాపింగ్ ఆరోపణలకు సంబంధించిన వివరాలు, వారి వద్ద ఉన్న సమాచారం, అనుమానాలకు గల కారణాలపై అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో ఈ ఇద్దరు ప్రజాప్రతినిధుల ఫోన్ నంబర్లు నిఘాకు గురైనట్లు సాంకేతిక ఆధారాలు లభించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు అధికారులు విచారణను మరింత లోతుగా నిర్వహిస్తున్నారు. ఆరోపణలకు మద్దతుగా ఉన్న ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో జారీ చేసిన నోటీసులకు అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయిన ఎమ్మెల్యేలకు తాజాగా మరోసారి నోటీసులు జారీ చేశారు. దాంతో వారు సిట్ ఎదుట హాజరై తమ వాంగ్మూలాలను నమోదు చేయించారు. అధికారులు సేకరించిన సాక్ష్యాధారాలను కూడా వారికి చూపించి వివరణలు తీసుకున్నట్లు సమాచారం. తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం గత కొంతకాలంగా చర్చనీయాంశంగా మారింది. రాజకీయ ప్రత్యర్థులపై నిఘా పెట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో ఈ కేసు ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ అంశంపై వివిధ రాజకీయ పార్టీలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం సిట్ దర్యాప్తు కొనసాగుతుండగా, కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆరోపణల వెనుక వాస్తవాలు ఏమిటన్నదానిపై దర్యాప్తు బృందం అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తోంది.

# భీమదేవరపల్లిలో బెల్ట్ షాపుల నిషేధానికి ఏకగ్రీవ తీర్మానం

**భీమదేవరపల్లి, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి గ్రామపంచాయతీలో సోమవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో గ్రామ ప్రజల ఆరోగ్యం, శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.
గ్రామంలో మద్యం అక్రమ విక్రయాలను అరికట్టి, యువతను మద్యం వ్యసనానికి దూరంగా ఉంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమావేశంలో సభ్యులు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణకు ఈ చర్య దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, ఉప సర్పంచ్ శనిగరం అయిలయ్య, గ్రామ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు ప్రేమలత, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, పోలు అశోక్, సాగంటి వెంకటేశ్వర్లు, బొల్లంపల్లి శ్యామ్, విజయ, సంధ్య పాల్గొన్నారు.

# జనసేన సభకు అనుమతి నిరాకరణ

- పోలీసుల నిర్ణయంపై చర్చ
- హైకోర్టును ఆశ్రయించిన జనసేన
- కోర్టు తీర్పుపై ఉత్కంఠ



**హైదరాబాద్, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు-):**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన "తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభ - జనసేన సాధక్ సమ్మేళనం"కు తెలంగాణ పోలీసులు అనుమతి నిరాకరించారు. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో జూన్ 2న ఈ సభను నిర్వహించాలని జనసేన పార్టీ ప్రణాళిక రూపొందించినప్పటికీ, శాంతిభద్రతల కారణాలను చూపుతూ పోలీసులు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో అధికారిక వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో భద్రతా బలగాలన్నీ ఆ విధుల్లో నిమగ్నమై ఉంటాయని పోలీసులు తెలిపారు. అదే రోజు రాజకీయ సభ నిర్వహిస్తే ట్రాఫిక్ సమస్యలతో పాటు శాంతిభద్రతల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో సభ నిర్వహణకు అనుమతి నిరాకరిస్తూ సంబంధిత అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలకు భద్రత కల్పించడం ప్రస్తుతం ప్రధాన ప్రాధాన్య అంశమని పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. పోలీసుల నిర్ణయంపై జనసేన పార్టీ నాయకత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. సభ నిర్వహణకు అనుమతి ఇవ్వాలని కోరుతూ పార్టీ తరఫున తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సభ నిర్వహణ తమ ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొంటూ అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో కోరినట్లు తెలిసింది. ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. కొందరు రాజకీయ నాయకులు సభ నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, తెలంగాణలో పార్టీ విస్తరణలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని జనసేన వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో పార్టీ కార్యకర్తలను సమీకరించి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయడమే లక్ష్యమని పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉండటంతో హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కోర్టు తీర్పు అనంతరం సభ నిర్వహణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త జడ్జీలు

- **కొలీజియం సిఫార్సులకు ఆమోదం**
- **కేంద్రం నోటిఫికేషన్ విడుదల**
- **మహిళా ప్రాతినిధ్యానికి ఊతం**

దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టుకు ఐదుగురు కొత్త న్యాయమూర్తులను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సోమవారం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని కొలీజియం ఇటీవల సిఫార్సు చేసిన పేర్లకు కేంద్రం ఆమోదం తెలపడంతో ఈ నియామకాలు ఖరారయ్యాయి. కొత్తగా నియమితులైన వారిలో సీనియర్ న్యాయవాది వి మోహన, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్, జస్టిస్ షీల్ నాగు, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్, జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. వీరి నియామకాలతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య మరింత బలపడనుంది. న్యాయవ్యవస్థలో అనుభవజ్ఞులైన వ్యక్తులకు అవకాశం కల్పించడం ద్వారా న్యాయపరమైన వ్యవహారాల పరిష్కారానికి మరింత వేగం చేకూరుతుందని భావిస్తున్నారు. ఈ జాబితాలో వి మోహన ఒక్కరే సీనియర్ న్యాయవాదిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె 1988లో కోయంబత్తూరు న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అయిదేళ్ల న్యాయ విద్యా కోర్సులో తొలి బ్యాచ్ విద్యార్థిగా చదువు పూర్తి చేశారు. అనంతరం ప్రముఖ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్ వద్ద జూనియర్‌గా పనిచేసి విశేష అనుభవాన్ని సంపాదించారు.

1996లో అడ్వకేట్ ఆన్ రికార్డ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్వతంత్రంగా న్యాయవాద వృత్తిని కొనసాగించారు. తన సుదీర్ఘ వృత్తి జీవితంలో కపిల్ సిబల్, కేకే వేణుగోపాల్, పి చిదంబరం, అరుణ్ జైట్లీ, అంద్యార్జున వంటి ప్రముఖ న్యాయవాదులతో కలిసి అనేక కీలక కేసుల్లో వాదనలు వినిపించారు. 2015 ఏప్రిల్ 23న ఆమెకు సీనియర్ న్యాయవాది హోదా లభించింది. వి మోహన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించడంతో మహిళా న్యాయమూర్తుల ప్రాతినిధ్యం మరింత బలోపేతమైంది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో మహిళా జడ్జిల సంఖ్య రెండుకు చేరింది. న్యాయవ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెరుగుతున్న సంకేతంగా ఈ పరిణామాన్ని న్యాయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కొత్త న్యాయమూర్తుల నియామకాలతో సుప్రీంకోర్టులో పెండింగ్ కేసుల పరిష్కార ప్రక్రియకు ఊతం లభించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో విభిన్న అనుభవాలు కలిగిన న్యాయమూర్తులు చేరడం వల్ల న్యాయ పరిపాలన మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.



# బ్లూటూత్ పేరుతో కలకలం

- **విమానంలో భద్రతా ఆందోళన**
- **ఎమర్జెన్సీగా యూటర్న్**
- **సురక్షితంగా ల్యాండింగ్**

ఒక బ్లూటూత్ పరికరానికి పెట్టిన పేరు అంతర్జాతీయ విమానంలో తీవ్ర కలకలం రేపింది. భద్రతా పరమైన అనుమానాలు తలెత్తడంతో విమాన సిబ్బంది ఎమర్జెన్సీ ప్రకటించి, ప్రయాణాన్ని మధ్యలోనే నిలిపివేసి విమానాన్ని తిరిగి బయల్దేరిన విమానాశ్రయానికే మళ్లించారు. ఈ ఘటన అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రంలో వెలుగుచూసింది. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ విమానం 190 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో నెవార్క్ విమానాశ్రయం నుంచి స్పెయిన్‌కు బయల్దేరింది. ప్రయాణం ప్రారంభమైన కొద్దిసేపటికే విమాన సిబ్బంది బ్లూటూత్ పరికరాల జాబితాను పరిశీలిస్తున్న సమయంలో ఒక డివైజ్ పేరు అనుమానాస్పదంగా కనిపించింది. ఆ పరికరానికి "బాంబ్" అనే పేరు ఉండటాన్ని గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. విమానంలో ఉన్న ప్రయాణికులందరూ తమ మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లోని బ్లూటూత్ సదుపాయాన్ని నిలిపివేయాలని పలుమార్లు ప్రకటించారు. అయితే అందరూ సూచనలు పాటించినప్పటికీ ఆ పేరుతో ఉన్న పరికరం మాత్రం నిరంతరం యాక్టివ్‌గా కనిపించింది. దాదాపు రెండు గంటలపాటు పరిస్థితిని గమనించిన సిబ్బంది భద్రతా నిబంధనలను దృష్టిలో ఉంచుకుని గ్రౌండ్ కంట్రోల్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఎలాంటి ప్రమాదాన్ని ముందుగానే నివారించాలనే ఉద్దేశంతో ఎమర్జెన్సీ ప్రకటించి విమానాన్ని వెనక్కి మళ్లించాలని నిర్ణయించారు. దీంతో విమానం తిరిగి నెవార్క్ విమానాశ్రయానికి చేరుకుని సురక్షితంగా ల్యాండ్ అయింది. అనంతరం భద్రతా సిబ్బంది విమానం, ప్రయాణికుల సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదకర వస్తువు లభించలేదని విదేశీ మీడియా కథనాలు పేర్కొన్నాయి. శనివారం జరిగిన ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన పోస్టుల ద్వారా వెలుగులోకి వచ్చింది. ఒక బ్లూటూత్ పరికరానికి సరదాగా పెట్టిన పేరు కూడా విమాన భద్రతా వ్యవస్థను ఎంతగానో ప్రభావితం చేయగలదని ఈ సంఘటన మరోసారి స్పష్టం చేసింది. విమాన ప్రయాణాల్లో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వడం వల్లే అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారని నిపుణులు పేర్కొంటున్నారు.




# స్వనిధితో వ్యాపారాభివృద్ధి

- **చిరు వ్యాపారులకు అండ**
- **డిజిటల్ చెల్లింపుల విప్లవం**
- **ఆర్థిక సాధికారతకు బాట**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకం దేశవ్యాప్తంగా చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఎలాంటి హామీ అవసరం లేకుండా రుణాలు అందించడం ద్వారా ఈ పథకం లక్షలాది కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకొచ్చింది. 2020లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 1.12 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయి. దేశంలోని నగరాలు, పట్టణాల్లో నివసించే 75 లక్షలకు పైగా లబ్ధిదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 17 వేల 800 కోట్ల రూపాయలకు పైగా రుణాలు పంపిణీ చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పథకానికి వస్తున్న విశేష ఆదరణను దృష్టిలో ఉంచుకుని దీనిని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ 2030 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. చిన్న వ్యాపారులకు ఆర్థికంగా బలాన్నివ్వడంతో పాటు స్వయం ఉపాధిని ప్రోత్సహించే దిశగా ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోంది. పీఎం స్వనిధి పథకం డిజిటల్ లావాదేవీల విస్తరణలో కూడా విశేష ఫలితాలు సాధించింది. దేశవ్యాప్తంగా 55 లక్షలకుపైగా లబ్ధిదారులు డిజిటల్ వేదికలతో అనుసంధానమయ్యారు. వీరు కలిపి 841 కోట్లకు పైగా డిజిటల్ లావాదేవీలు నిర్వహించగా, వాటి మొత్తం విలువ 8.96 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు అందించిన నగదు ప్రోత్సాహకాలు, వడ్డీ రాయితీల రూపంలో లబ్ధిదారులకు సుమారు 800 కోట్ల రూపాయల ప్రయోజనం లభించింది.



ఈ పథకం కింద మూడు దశల్లో ఎలాంటి గ్యారెంటీ లేకుండా 15 వేల రూపాయలు, 25 వేల రూపాయలు, 50 వేల రూపాయల వరకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలు అందిస్తున్నారు. రెండో దశ రుణాన్ని విజయవంతంగా చెల్లించిన వ్యాపారులకు 30 వేల రూపాయల పరిమితితో యూపీఐ అనుసంధానిత రూపే క్రెడిట్ కార్డు అందిస్తున్నారు. అలాగే స్వనిధి సే సమృద్ధి కార్యక్రమం ద్వారా లబ్ధిదారులను పలు కేంద్ర సంక్షేమ పథకాలతో అనుసంధానం చేస్తున్నారు. వ్యాపారుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆహార భద్రత, పరిశుభ్రత అంశాలపై ప్రత్యేక శిక్షణ కూడా అందిస్తున్నారు. దీనివల్ల వ్యాపార నిర్వహణలో మెరుగైన అవగాహన పెరగడంతో పాటు ఆదాయ వృద్ధికి దోహదపడుతోంది. వ్యాపార కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం లబ్ధిదారుల్లో పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. 2023, 2025 సంవత్సరాల్లో నిర్వహించిన స్వతంత్ర ప్రభావ అంచనా అధ్యయనాల ప్రకారం ఈ పథకం లబ్ధిదారుల వార్షిక ఆదాయం సగటున 20 శాతం మేర పెరిగినట్లు వెల్లడైంది. లబ్ధిదారుల్లో 46 శాతం మంది మహిళలు ఉండటం విశేషం. అలాగే సుమారు 70 శాతం మంది వెనుకబడిన వర్గాలకు చెందినవారు కావడం ఈ పథకం సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహిస్తున్నదని స్పష్టం చేస్తోంది. ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పీఎం స్వనిధి పథకం లక్షలాది వీధి వ్యాపారుల జీవితాల్లో విశేష మార్పు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. నమ్మకం, గౌరవం, సాధికారతకు ప్రతీకగా ఈ పథకం నిలిచిందని ఆయన అభిప్రాయపడ్డారు.

# భారత్ – ఆస్ట్రేలియా రక్షణ చర్చలు

- **ఢిల్లీలో కీలక భేటీ**
- **ద్వైపాక్షిక సహకారంపై సమీక్ష**
- **భాగస్వామ్యానికి కొత్త ఊపు**

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆస్ట్రేలియా ఉప ప్రధానమంత్రి, రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్‌తో న్యూఢిల్లీలో కీలక సమావేశం నిర్వహించారు. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న రక్షణ సహకారాన్ని సమగ్రంగా సమీక్షించిన ఈ భేటీలో భవిష్యత్తులో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా భారత్-ఆస్ట్రేలియా రక్షణ సంబంధాల ప్రస్తుత పరిస్థితి, వ్యూహాత్మక భాగస్వామ్యం, పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను ఇద్దరు నేతలు పరిశీలించారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, భద్రత పరిరక్షణలో ఇరు దేశాల పాత్రపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. రక్షణ రంగంలో సంయుక్త విన్యాసాలు, సాంకేతిక సహకారం, సైనిక శిక్షణ కార్యక్రమాలు, సముద్ర భద్రత వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చ జరిగినట్లు సమాచారం. ఇరు దేశాల సైనిక దళాల మధ్య పరస్పర సహకారం పెంపొందించేందుకు అవసరమైన చర్యలపై దృష్టి సారించారు.




సమావేశం అనంతరం రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం ద్వారా స్పందిస్తూ రిచర్డ్ మార్లెస్‌తో అద్భుతమైన సమావేశం జరిగిందని పేర్కొన్నారు. ద్వైపాక్షిక రక్షణ సహకారంలోని అన్ని అంశాలను సమీక్షించామని, వాటిని మరింత విస్తరించే మార్గాలపై చర్చించినట్లు వెల్లడించారు. భారత్-ఆస్ట్రేలియా రక్షణ భాగస్వామ్యం రానున్న సంవత్సరాల్లో మరింత స్థిరంగా ముందుకు సాగుతుందని రాజ్‌నాథ్ సింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు. పరస్పర నమ్మకం, వ్యూహాత్మక అవగాహన ఆధారంగా ఈ సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవలి కాలంలో భారత్, ఆస్ట్రేలియా మధ్య రక్షణ, వాణిజ్యం, భద్రత రంగాల్లో సహకారం గణనీయంగా పెరుగుతోంది. తాజా సమావేశం ద్వారా ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడే అవకాశం ఉందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# బెంగాల్‌లో మంత్రివర్గ విస్తరణ

- **ముప్పై ఐదుగురికి అవకాశం**
- **లోక్ భవన్ కార్యక్రమం**
- **మరో విస్తరణకు అవకాశం**

పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన సువేందు అధికారి నాయకత్వంలోని ప్రభుత్వం తాజాగా మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం ముప్పై ఐదుగురు భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని లోక్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. గవర్నర్ ఆర్ ఎన్ రవి నూతన మంత్రులతో ప్రమాణం చేయించారు. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టనున్న ఈ మంత్రులు తమ పదవీ బాధ్యతలను త్వరలో స్వీకరించనున్నారు. మంత్రివర్గ విస్తరణ ద్వారా పాలనలో మరింత వేగం తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ నూట అరవై నాలుగు ఉపనిబంధన ఒకటి ప్రకారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంలో మొత్తం నలభై నాలుగు మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా ముప్పై ఐదుగురికి చోటు కల్పించడంతో ముఖ్యమంత్రితో కలిపి మంత్రివర్గ సభ్యుల సంఖ్య నలభై ఒకటికి చేరింది. దీంతో ఇంకా ముగ్గురు సభ్యులకు అవకాశం మిగిలి ఉండటంతో భవిష్యత్తులో మరోసారి మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గత నెల తొమ్మిదో తేదీన సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్, నిశిత్ ప్రణామిక్, అశోక్ కీర్తనియా, క్షుదిరామ్ టూడు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇప్పుడు జరిగిన విస్తరణతో ప్రభుత్వానికి మరింత విస్తృతమైన మంత్రివర్గ బలం లభించింది.



తాజాగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో దీపక్ బర్మాన్, తపాస్ రాయ్, శంకర్ ఘోష్, మనోజ్ కుమార్ ఒరావోన్, గౌరీ శంకర్ ఘోష్, స్వపన్ దాస్ గుప్తా, కల్యాణ్ చక్రవర్తి, అరుప్ కుమార్ దాస్, దూద్ కుమార్ మోండల్, శరద్వాత్ ముఖర్జీ, జగన్నాథ్ చట్టోపాధ్యాయ్, అర్జున్ సింగ్, మాలతీ రావా రాయ్, రాజేష్ మహతా, ఇంద్రాని ఖాన్, కౌషిక్ చౌదరి, గార్గి దాస్ ఘోష్, భాస్కర్ భట్టాచార్య తదితరులు ఉన్నారు. అలాగే దిబాకర్ ఘరామి, సుమన సర్కార్, జోయెల్ ముర్ము, అశోక్ దిండా, ఆనందమయ్ బర్మన్, హరేకృష్ణ బేరా, శంతను ప్రమాణిక్, ఉమేష్ రాయ్, పూర్ణిమా చక్రవర్తి, మౌమితా బిశ్వాస్ మిశ్రా, కలితా మాజి, బిషాల్ లామా, అజయ్ కుమార్ పొద్దార్, బిరాజ్ బిశ్వాస్, దీపాంకర్ జానా, అమైరా కిస్కు, నదియార్ చాంద్ బౌరి కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ విస్తరణతో రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థకు మరింత బలం చేకూరుతుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# మే నెలలో యూపీఐ చెల్లింపుల జోరు..

దేశంలో డిజిటల్ చెల్లింపుల విస్తరణ మరింత వేగం అందుకుంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా మే నెలలో జరిగిన లావాదేవీలు కొత్త రికార్డులను నమోదు చేశాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాల ప్రకారం, మే నెలలో యూపీఐ ద్వారా మొత్తం రూ.29.9 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు నమోదయ్యాయి.

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో యూపీఐ ద్వారా రూ.29.03 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరగగా, మే నెలలో ఆ మొత్తం మరింత పెరిగింది. గత ఏడాది మే నెలలో నమోదైన రూ.24.14 లక్షల కోట్ల లావాదేవీలతో పోలిస్తే ఈసారి 19 శాతం వృద్ధి నమోదైంది. లావాదేవీల సంఖ్య పరంగానూ గణనీయమైన పెరుగుదల కనిపించింది. గత ఏడాది మే నెలలో 1,867 కోట్ల లావాదేవీలు నమోదవగా, ఈ ఏడాది మే నెలలో అవి 2,320 కోట్లకు చేరుకున్నాయి. ఇది వార్షిక ప్రాతిపదికన 24 శాతం వృద్ధిని సూచిస్తోంది.

వేసవి సెలవుల నేపథ్యంలో ప్రయాణాలు, కొనుగోళ్లు, సేవల వినియోగం పెరగడం వల్ల యూపీఐ చెల్లింపులు అధికమయ్యాయని ఎన్‌పీసీఐ అభిప్రాయపడుతోంది. అదే సమయంలో స్మార్ట్‌ఫోన్ వినియోగం విస్తరించడం, క్యూఆర్ కోడ్ ఆధారిత చెల్లింపులు సాధారణమవడం, డిజిటల్ లావాదేవీలపై ప్రజల్లో విశ్వాసం పెరగడం కూడా ఈ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.

గ్రామీణ ప్రాంతాల్లో సైతం యూపీఐ వినియోగం వేగంగా పెరుగుతుండటం గమనార్హం. చిన్న వ్యాపారాల నుంచి పెద్ద రిటైల్ సంస్థల వరకు డిజిటల్ చెల్లింపుల స్వీకరణ విస్తరించడంతో నగదు వినియోగం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. దీంతో యూపీఐ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక చెల్లింపు వేదికగా మరింత బలపడుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.



# పెట్రోల్‌కు గుడ్‌బై చెప్పే హీరో బైక్..

భారత ద్విచక్ర వాహన రంగంలో కొత్త అధ్యాయానికి హీరో మోటోకార్ప్ తెరలేపుతోంది. పెట్రోల్‌పై ఆధారపడకుండా పూర్తిగా ఇథనాల్ ఇంధనంతో నడిచే 'ఈ100' బైక్‌ను జూన్ 3న మార్కెట్లోకి తీసుకురావడానికి సంస్థ సిద్ధమైంది. దేశంలోనే వంద శాతం ఇథనాల్ ఇంధనంతో నడిచే తొలి ద్విచక్ర వాహనంగా ఈ బైక్ నిలవనుంది. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం, దిగుమతి చేసుకునే ఇంధనంపై ఆధారాన్ని తగ్గించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఫ్లెక్స్‌ఫ్యూయల్ వాహనాలను ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో హీరో మోటోకార్ప్ తీసుకొస్తున్న 'ఈ100' బైక్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం మార్కెట్లో 85 శాతం ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని వినియోగించే కొన్ని మోడళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, పూర్తి స్థాయిలో ఇథనాల్‌తో నడిచే బైక్‌ను ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. దీంతో ప్రత్యామ్నాయ ఇంధన వాహనాల విభాగంలో హీరో మోటోకార్ప్ కొత్త ప్రమాణాలను నెలకొల్పనుంది. హీరో సంస్థకు అత్యంత ప్రజాదరణ పొందిన హెచ్‌ఎఫ్ డీలక్స్, స్ప్లెండర్ మోడళ్లలో 'ఈ100' వెర్షన్‌ను ప్రవేశపెట్టేందుకు అవసరమైన అనుమతులు ఇప్పటికే లభించాయి. అయితే ఈ రెండు మోడళ్లలో ఏదిని ముందుగా మార్కెట్లోకి తీసుకువస్తారనే విషయాన్ని సంస్థ ఇప్పటివరకు అధికారికంగా వెల్లడించలేదు. ఇథనాల్ ధర పెట్రోల్‌తో పోలిస్తే తక్కువగా ఉండటంతో వాహనదారుల ఇంధన వ్యయం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా రోజువారీ ప్రయాణాలు చేసే వినియోగదారులకు ఈ బైక్ ఆర్థికంగా లాభదాయకంగా మారవచ్చని నిపుణులు భావిస్తున్నారు. మైలేజీ, పనితీరు, ధర వంటి పూర్తి వివరాలు జూన్ 3న జరిగే ఆవిష్కరణ కార్యక్రమంలో వెల్లడికానున్నాయి. సామాన్య వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఈ బైక్‌ను అందుబాటు ధరలోనే తీసుకురావాలని హీరో మోటోకార్ప్ యోచిస్తున్నట్లు ఆటోమొబైల్ వర్గాలు చెబుతున్నాయి.



# ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల్లో జోరు..

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల భారం పెరుగుతుండటంతో వాహన వినియోగదారులు ఎలక్ట్రిక్ వాహనాల వైపు వేగంగా మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా ఈస్కూటర్లు, ఈబైక్‌లకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. మే నెలలో దేశవ్యాప్తంగా లక్షా యాభై వేలకుపైగా ఎలక్ట్రిక్ వాహనాలు నమోదు కావడం ఈ రంగం వృద్ధికి నిదర్శనంగా నిలిచింది.

గత మార్చి నెలలో రికార్డు స్థాయి అమ్మకాలు నమోదైన అనంతరం ఏప్రిల్‌లో కొంత మందగమనం కనిపించినప్పటికీ, మే నెలలో మళ్లీ విక్రయాలు ఊపందుకున్నాయి. పెరుగుతున్న ఇంధన వ్యయాలను తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను ఎంచుకుంటున్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

అమ్మకాలలో ముందంజలో ప్రముఖ సంస్థలు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల మార్కెట్లో పోటీ తీవ్రంగా కొనసాగుతున్నప్పటికీ కొన్ని సంస్థలు విశేష ప్రగతి సాధించాయి. టీవీఎస్, బజాజ్ ఆటో సంస్థలు అమ్మకాల పరంగా అగ్రస్థానాల్లో నిలవగా, ఏథర్, హీరో, ఓలా సంస్థలు కూడా గణనీయమైన విక్రయాలను నమోదు చేశాయి. మెరుగైన బ్యాటరీ సామర్థ్యం, అధునాతన సాంకేతిక ఫీచర్లు, ఎక్కువ ప్రయాణ దూరం అందించే మోడళ్లకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

పర్యావరణహిత రవాణాకు పెరుగుతున్న ఆదరణ తక్కువ నిర్వహణ వ్యయం, ఇంధన ఖర్చుల తగ్గింపు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచుతున్నాయి. దేశవ్యాప్తంగా ఛార్జింగ్ కేంద్రాల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతుండటంతో ఈ వాహనాలపై ప్రజల్లో నమ్మకం బలపడుతోంది.

ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలు, సులభ వాయిదా పద్ధతులు కూడా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లకు ఊతమిస్తున్నాయి. రాబోయే కాలంలో మరింత మంది వినియోగదారులు సంప్రదాయ ఇంధన వాహనాల నుంచి ఎలక్ట్రిక్ వాహనాలకు మారే అవకాశాలు ఉన్నాయని ఆటోమొబైల్ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




# మూడేళ్లలో రూ.50 వేల కోట్ల లక్ష్యం..

**విస్తరణపై ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ దృష్టి**

తక్కువ, మధ్యతరగతి ఆదాయ వర్గాలకు గృహ రుణాలు అందిస్తున్న ప్రముఖ సంస్థ ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ రాబోయే మూడేళ్లలో తన నిర్వహణలోని ఆస్తుల విలువను రూ.50 వేల కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం సంస్థ రుణాల పంపిణీలో స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తుండటంతో ఈ లక్ష్యాన్ని చేరుకోవడంపై యాజమాన్యం విశ్వాసం వ్యక్తం చేసింది.

సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ప్రధాన కార్యనిర్వాహక అధికారి రిషి ఆనంద్ మాట్లాడుతూ, ప్రతి ఏడాది 18 నుంచి 20 శాతం వరకు రుణ వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి సంస్థ నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.30,571 కోట్లకు చేరిందని వెల్లడించారు.

దేశంలో పెరుగుతున్న గృహ అవసరాలు, పట్టణీకరణ, ప్రభుత్వ గృహ పథకాల ప్రోత్సాహం, ముఖ్యంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన వంటి కార్యక్రమాలు గృహరంగానికి ఊతమిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. సంస్థ నికర లాభాల్లో కూడా ప్రతి సంవత్సరం 20 నుంచి 22 శాతం వరకు వృద్ధి కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తాజా ఆర్థిక ఫలితాల్లో ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ మెరుగైన పనితీరును కనబరిచింది. సంస్థ నికర లాభం 22 శాతం పెరిగి రూ.1,108 కోట్లకు చేరుకుంది. రుణాల నాణ్యత కూడా స్థిరంగా కొనసాగుతోంది. స్థూల నిరర్థక ఆస్తుల శాతం నియంత్రణలో ఉండగా, సంస్థ మూలధన పర్యాప్త నిష్పత్తి 42 శాతంగా నమోదై ఆర్థికంగా బలమైన స్థితిని ప్రతిబింబిస్తోంది.

ఏ ఒక్క రాష్ట్రంపైనే అధిక ఆధారపడకుండా భౌగోళిక వైవిధ్యాన్ని పాటిస్తున్నామని సంస్థ తెలిపింది. ప్రస్తుతం దేశంలోని 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 552 జిల్లాల పరిధిలో 626 శాఖల ద్వారా సేవలు అందిస్తోంది. సుమారు 3.40 లక్షల క్రియాశీల ఖాతాదారులు సంస్థ సేవలను వినియోగిస్తున్నారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా మరో 40 నుంచి 45 కొత్త శాఖలను ప్రారంభించి కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు సంస్థ వెల్లడించింది. గ్రామీణ, పట్టణ శివారు ప్రాంతాల్లో గృహ రుణాల డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో విస్తరణ ప్రణాళికలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు యాజమాన్యం పేర్కొంది.

# మేలో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లు

దేశంలో వస్తు సేవల పన్ను వసూళ్లు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది మే నెలలో స్థూల జీఎస్‌టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గత ఏడాది మే నెలలో నమోదైన రూ.1.88 లక్షల కోట్లతో పోలిస్తే ఈసారి 3.2 శాతం వృద్ధి నమోదైంది. రిఫండ్‌లను సర్దుబాటు చేసిన అనంతరం నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.67 లక్షల కోట్లకు చేరగా, ఇది గత ఏడాదితో పోలిస్తే 3.3 శాతం అధికంగా ఉంది.

ఏప్రిల్ నెలలో నమోదైన రికార్డు స్థాయి రూ.2.43 లక్షల కోట్ల వసూళ్లతో పోలిస్తే మే నెలలో ఆదాయం తగ్గినప్పటికీ, ఆర్థిక సంవత్సరం ప్రారంభ దశలో ఇటువంటి తగ్గుదల సహజమేనని అధికారులు తెలిపారు. ఈసారి జీఎస్‌టీ వసూళ్ల పెరుగుదలకు దిగుమతులు ప్రధాన కారణంగా నిలిచాయి. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 2.6 శాతం తగ్గి సుమారు రూ.1.34 లక్షల కోట్లుగా నమోదవగా, దిగుమతులపై జీఎస్‌టీ వసూళ్లు 19.1 శాతం పెరిగి రూ.59,654 కోట్లకు చేరాయి.

మే నెలలో రిఫండ్‌ల చెల్లింపులు కూడా పెరిగాయి. మొత్తం రిఫండ్‌లు 2.6 శాతం వృద్ధితో రూ.27,281 కోట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలలైన ఏప్రిల్, మే కాలంలో స్థూల జీఎస్‌టీ వసూళ్లు 6.2 శాతం పెరిగి రూ.4.37 లక్షల కోట్లకు చేరినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశీయ ఆర్థిక కార్యకలాపాలు, దిగుమతుల వృద్ధి ప్రభావంతో రానున్న నెలల్లో కూడా పన్ను వసూళ్లు సానుకూలంగా కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.






## ‘సాహో’తో మిస్సైన కిక్ ‘స్పిరిట్’ ఇవ్వబోతుందా?

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ తనకి బాహుబలి సినిమాల తర్వాత ఒకదానికి ఒకటి సంబంధం లేకుండా ఇంట్రెస్టింగ్ జానర్ లలో క్రేజీ ప్రాజెక్ట్ లు చేస్తూ వచ్చారు. అయితే ఈ లైనప్ లో కొన్ని ఫ్లాప్ లు కూడా పడ్డప్పటికీ ప్రభాస్ క్రేజ్, మార్కెట్ చెక్కు చెదరలేదు. అలాంటి ఫ్లాప్ లలో కూడా భారీ వసూళ్లు సాధించినవి ఉన్నాయి. మరి ఆ చిత్రాల్లో సాలిడ్ యాక్షన్ గ్యాంగ్ స్టర్ డ్రామా ‘సాహో’ కూడా ఒకటి.

యంగ్ దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన ఈ సినిమాలో బాగా డిజప్పాయింట్ చేసిన విషయాల్లో ప్రభాస్ ని పోలీస్ యూనిఫామ్ లో చూపించకపోవడం అని కూడా చెప్పొచ్చు. ఈ సినిమాలో ప్రభాస్ మొదటిసారి పోలీస్ గా కనిపిస్తాడమే ఎగ్జైట్మెంట్ అప్పట్లో అభిమానుల్లో అంతా ఇంతా కాదు.

కానీ సింపుల్ గా ప్రభాస్ అందులో కనిపిస్తాడు. కానీ ఆ ఆకలి ఇప్పుడు సందీప్ రెడ్డి వంగ స్పిరిట్ తో తీర్చబోతున్నట్టు తెలుస్తుంది. ఈ సినిమాలో ప్రభాస్ పోలీస్ అని అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు ప్రభాస్ పైనే పవర్ఫుల్ ఐపీఎస్ ఆఫీసర్ కాస్ట్యూమ్ లో కీలక సన్నివేశాలు షూట్ చేస్తున్నట్టుగా తెలుస్తుంది. సో మొత్తానికి ప్రభాస్ ని ఇలా చూడాలి అనుకునే కోరిక స్పిరిట్ తో తీరబోతుంది అని చెప్పవచ్చు.



## 28 లక్షల ఖరీదైన సర్ప్రైజ్ ఇచ్చిన సూర్య!

కోలీవుడ్ స్టార్ నటుడు సూర్య ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కంబ్యాక్ హిట్ ని దర్శకుడు ఆర్జే బాలాజీ ఫైనల్ గా కరుప్పు/వీరభద్రుడు సినిమాతో అందించాడు. తిప్పి కొడితే సూర్య 300 కోట్ల క్లబ్ లోకి చేరి సాలిడ్ వసూళ్లు, బుకింగ్స్ తో ఇప్పటికీ నిలకడ కొనసాగిస్తున్నాడు. ఇలా తనకి సెన్సేషనల్ సక్సెస్ ఇచ్చిన కీలక పాత్రధారులకి సూర్య తన తరపు నుంచి ఇంట్రెస్టింగ్ సర్ప్రైజ్ లని అందిస్తున్నారు.

లేటెస్ట్ గా సినిమా సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ కి కూడా సూర్య ఖరీదైన సర్ప్రైజ్ ని అందించగా సాయి దానిని సోషల్ మీడియాలో పంచుకొని ఆనందం వ్యక్తం చేస్తూ సూర్యకి థాంక్స్ చెప్పుకొచ్చాడు. అయితే సూర్య సాయి అభ్యంకర్ కోసం మహీంద్రా నుంచి లేటెస్ట్ లగ్జరీ ఎక్స్ యూ వి కార్ ని బహుమతిగా అందించారు. దీని ధర మార్కెట్ లో 28 లక్షలకి పైగానే ఉంది. దీనితో తనకి సూర్య ఇచ్చిన ఈ సర్ప్రైజ్ గిఫ్ట్ వైరల్ గా మారింది.




## గోపీచంద్ కొత్త సినిమా షూటింగ్ ప్రారంభం

యాక్షన్ హీరో గోపీచంద్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న కొత్త సినిమా షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. ప్రముఖ ఫైట్ మాస్టర్ వీ వెంకట్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రస్తుతం మరో చిత్రంలో నటిస్తున్న గోపీచంద్, అదే సమయంలో ఈ కొత్త ప్రాజెక్టును కూడా పట్టాలెక్కించడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఈ చిత్రంలో అనార్కలి నాజర్ కథానాయికగా నటిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సంగీతాన్ని శ్యామ్ సీఎస్ అందిస్తున్నారు. ఇటీవల విడుదలైన తొలి ప్రచార చిత్రంలో మండుతున్న ఆకాశం మధ్య కొండపై నిలిచిన నల్ల చిరుత దృశ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రచార చిత్రం ద్వారా సినిమా తీవ్రమైన యాక్షన్, పురాణ గాథల నేపథ్యంతో రూపొందుతున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. జాతీయ పురస్కార గ్రహీత శ్రీకర్ ప్రసాద్ చిత్రానికి ఎడిటర్‌గా పనిచేస్తుండగా, రామకృష్ణ-మౌనిక నిర్మాణ రూపకల్పన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.

ఇప్పటికే విజయవంతమైన పలు చిత్రాలను నిర్మించిన సంస్థ ఈ సినిమాను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. గోపీచంద్ అభిమానుల్లో ఈ చిత్రంపై మంచి అంచనాలు నెలకొన్నాయి.



## జపాన్ ట్రిప్‌లో మిస్టరీ వ్యక్తి.. మళ్లీ వైరల్‌గా మారిన రష్మిక ఫొటోలు..!

స్టార్ నటి రష్మిక మందన్న మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక యానిమే అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, అనంతరం తన జపాన్ పర్యటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను అభిమానులతో పంచుకుంది. అయితే ఈ ఫొటోలు కేవలం ఆమె అందం లేదా జపాన్ అందాల వల్లే కాకుండా, అందులో కనిపించిన ఓ మిస్టరీ వ్యక్తి కారణంగా కూడా వైరల్ అవుతున్నాయి. తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో జపాన్ పర్యటనకు సంబంధించిన పలు చిత్రాలు, వీడియోలను పంచుకున్న రష్మిక, “ఈ ఏడాది జపాన్ ట్రిప్ మరింత ప్రత్యేకంగా, సరదాగా సాగింది” అంటూ వ్యాఖ్య జత చేసింది. ఈ ఫొటోల్లో ఆమె జపాన్ వీధుల్లో విహరిస్తూ, అక్కడి సంస్కృతి, సంప్రదాయాలను ఆస్వాదిస్తున్న దృశ్యాలు కనిపించాయి. జపాన్ సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ రూపానికి నెటిజన్ల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఫొటోలతో పాటు పంచుకున్న వీడియోల్లో రష్మిక తన చిలిపి స్వభావాన్ని మరోసారి ప్రదర్శించింది. జపాన్‌లోని పర్యాటక ప్రాంతాల్లో సరదాగా గడిపిన క్షణాలను అభిమానులతో పంచుకోవడంతో ఆ వీడియోలు కూడా మంచి ఆదరణ పొందుతున్నాయి. ఆమె నవ్వులు, అల్లరి చేష్టలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

## లక్కీ ఛాన్స్ కొట్టేసిన ‘లిటిల్ హార్ట్స్’ బ్యూటీ



గత ఏడాది తెలుగు సినిమా దగ్గర వచ్చి సూపర్ హిట్ అయ్యిన పలు చిన్న చిత్రాల్లో లిటిల్ హార్ట్స్ కూడా ఒకటి. మరి ఈ చిత్రంలో తెలుగు బ్యూటీ శివాని నాగారం హీరోయిన్ గా నటించి అందరి దృష్టి ఆకర్షించింది. మొత్తం మూడు సినిమాలు తెలుగులో చేసి ఇప్పుడు నెక్స్ట్ ప్రాజెక్ట్ గా ఓ క్రేజీ కాంబినేషన్ లో ఛాన్స్ కొట్టేసింది.

తన డెబ్యూ సినిమాతోనే తమిళ్ లో అదరగొట్టిన యువ దర్శకుడు హీరో అభీషన్ జీవింత్ అలాగే కన్నడ స్టార్ నటుడు శివ రాజ్ కుమార్ కాంబినేషన్ లో వస్తున్న సినిమాలో శివాని కూడా నటిస్తున్నట్టు ఇపుడు ఖరారు అయ్యింది. నిజానికి అభీషన్ ఈ సినిమాని దర్శకత్వం వహిస్తాడని చాలామంది అనుకున్నారు కానీ ఈ చిత్రాన్ని గౌతమ్ శివరామన్ దర్శకత్వం వహించనున్నారు. ఇలా కన్నడ, తమిళ్ స్టార్స్ సినిమాలో శివానికి లక్కీ ఛాన్స్ నే దొరికింది అని చెప్పొచ్చు. ఇక ఈ సినిమాకి సంబంధించి మరిన్ని డీటెయిల్స్ బయటకి రావాల్సి ఉంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ ఆవిర్భావ గాథ

## ఉద్యమ జ్వాలల చరిత్ర.. సాధించిన రాష్ట్ర స్వప్నం.. అభివృద్ధి వైపు అడుగులు

**డెస్క్, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** భారతదేశ రాజకీయ చరిత్రలో జూన్ 2 తేదీ తెలంగాణ ప్రజలకు అత్యంత ప్రాధాన్యమైన రోజుగా నిలిచింది. ఎన్నో దశాబ్దాలుగా సాగిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ రోజు కేవలం ఒక కొత్త రాష్ట్రం ఏర్పడిన రోజు మాత్రమే కాదు, కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలు నెరవేరిన రోజు కూడా. తెలంగాణ ప్రజలు తమ ప్రాంత అభివృద్ధి, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం సాగించిన పోరాటానికి ఈ రోజు చారిత్రక గుర్తింపుగా నిలిచిపోయింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. స్వాతంత్ర్యం అనంతరం రాజకీయ పరిణామాలు, ప్రాంతీయ అసమానతలు, నీటి వనరుల పంపిణీ, ఉద్యోగ అవకాశాల విషయంలో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందనే భావన ప్రజల్లో బలపడింది. కాలక్రమేణా ఈ అసంతృప్తి ఉద్యమంగా రూపాంతరం చెందింది. విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మేధావులు, కళాకారులు సహా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమంలో భాగస్వాములై ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌ను బలంగా వినిపించారు.

ఉద్యమ కాలంలో అనేక నిరసనలు, ర్యాలీలు, సభలు నిర్వహించబడ్డాయి. వేలాది మంది యువత ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం అనేక మంది తమ జీవితాలను అంకితం చేశారు. ఉద్యమంలో పాల్గొన్న అమరవీరుల త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. వారి త్యాగాలే ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చి రాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేశాయి. దీర్ఘకాల పోరాటం అనంతరం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో ఉద్యమకారుల కల నిజమైంది.

2014 జూన్ 2న తెలంగాణ అధికారికంగా దేశంలోని కొత్త రాష్ట్రంగా అవతరించింది. హైదరాబాద్‌ను రాజధానిగా ప్రకటిస్తూ రాష్ట్ర పరిపాలన ప్రారంభమైంది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలు సంబరాలు చేసుకుంటూ తమ ఎన్నో ఏళ్ల స్వప్నాన్ని సాకారం చేసుకున్నారు.

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణ అనేక రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధించింది. సమాచార సాంకేతిక రంగంలో హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూ పెట్టుబడులను ఆకర్షించింది. పారిశ్రామిక రంగం విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, నగరాల ఆధునీకరణ వంటి అంశాల్లో రాష్ట్రం ముందంజలో నిలిచింది. కొత్త పరిశ్రమలు స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయి. వ్యవసాయ రంగంలో కూడా పలు కీలక కార్యక్రమాలు అమలులోకి వచ్చాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, రైతులకు వివిధ రకాల సహాయక పథకాలు వ్యవసాయాభివృద్ధికి దోహదపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే ప్రయత్నాలు జరిగాయి. దీని ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో కూడా తెలంగాణ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, సామాజిక సంక్షేమ పథకాల అమలు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు చర్యలు తీసుకుంది. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రతి సంవత్సరం జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా వేదికలలో జెండా ఆవిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అమరవీరులకు నివాళి కార్యక్రమాలు జరుగుతాయి. రాష్ట్ర సాధన కోసం పోరాడిన వారిని స్మరించుకుంటూ ప్రజలు ఈ రోజును గర్వంగా జరుపుకుంటారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ప్రజల ఐక్యతకు, ఆత్మగౌరవానికి, అభివృద్ధి సంకల్పానికి ప్రతీకగా నిలుస్తూ భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తోంది.



# గౌరవం కోసం పోరాటం



- **హక్కులపై అవగాహన**
- **భద్రతకు ప్రాధాన్యం**
- **సమానత్వమే లక్ష్యం**
- **అంతర్జాతీయ లైంగిక కార్మికుల దినోత్సవం**

**డెస్క్, జూన్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతి సంవత్సరం జూన్ 2న అంతర్జాతీయ లైంగిక కార్మికుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. సమాజంలో లైంగిక కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, భద్రత, గౌరవప్రద జీవనం వంటి అంశాలపై అవగాహన పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. సమాజంలో తరచుగా వివక్షకు గురవుతున్న ఈ వర్గం సమస్యలను ప్రపంచ దృష్టికి తీసుకురావడంలో ఈ రోజు కీలక పాత్ర పోషిస్తోంది. లైంగిక కార్మికులు అనేక దేశాల్లో సామాజిక ముద్ర, వివక్ష, ఆర్థిక ఇబ్బందులు, చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఉపాధి అవకాశాల కొరత, పేదరికం, కుటుంబ పరిస్థితులు వంటి అనేక కారణాల వల్ల ఈ రంగంలోకి వచ్చిన వారు సమాజంలో సరైన గుర్తింపు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి జీవన పరిస్థితులపై అవగాహన పెంపొందించడం అవసరమని మానవ హక్కుల సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ దినోత్సవం మూలాలు 1975లో ఫ్రాన్స్‌లో జరిగిన ఒక చారిత్రక నిరసన కార్యక్రమంతో ముడిపడి ఉన్నాయి. అక్కడ లైంగిక కార్మికులు తమ హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అప్పటి నుంచి వారి హక్కులపై చర్చలు మరింత విస్తరించాయి. అనంతరం జూన్ 2ను అంతర్జాతీయ లైంగిక కార్మికుల దినోత్సవంగా గుర్తించి అనేక దేశాల్లో పాటించడం ప్రారంభమైంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థలు, మానవ హక్కుల సంఘాలు లైంగిక కార్మికులకు ఆరోగ్య సేవలు, సామాజిక భద్రత, చట్టపరమైన రక్షణ అందుబాటులో ఉండాలని సూచిస్తున్నాయి. ఆరోగ్య పరిరక్షణ, మానసిక ఆరోగ్య సేవలు, అత్యవసర సహాయ వ్యవస్థలు అందరికీ సమానంగా అందాలని అవి పేర్కొంటున్నాయి. సమాజంలో ప్రతి వ్యక్తికి గౌరవప్రద జీవనం హక్కుగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తరించిన నేటి కాలంలో ఆన్‌లైన్ వేదికల ద్వారా కూడా లైంగిక కార్మికులు కొత్త రకాల సవాళ్లను ఎదుర్కొంటున్నారు. మోసాలు, వేధింపులు, భద్రతా సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో వారికి రక్షణ కల్పించే విధానాల అవసరం పెరుగుతోంది. ఈ అంశాలపై ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఈ వర్గానికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించడంలో సహాయపడుతున్నాయి. అనేక దేశాల్లో స్వచ్ఛంద సంస్థలు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జీవనోపాధి అవకాశాలను విస్తరిస్తున్నాయి. ఆర్థిక స్వావలంబన కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. సమాజంలో ఉన్న అపోహలు, ప్రతికూల అభిప్రాయాలను తొలగించడం కూడా ఈ దినోత్సవం ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. వ్యక్తుల వృత్తి ఏదైనా కావచ్చు, వారికి మానవ హక్కులు, గౌరవం, భద్రత సమానంగా ఉండాలనే సందేశాన్ని ఈ రోజు బలంగా వినిపిస్తుంది. సామాజిక అంగీకారం పెరిగితేనే వివక్ష తగ్గి సమానత్వం సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ లైంగిక కార్మికుల దినోత్సవం కేవలం ఒక వర్గం సమస్యలపై చర్చించే రోజు మాత్రమే కాదు. మానవ హక్కులు, గౌరవప్రద జీవనం, సమాన అవకాశాల ప్రాముఖ్యతను గుర్తు చేసే సందర్భం కూడా. ప్రతి వ్యక్తి గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉన్నాడనే సందేశాన్ని ప్రపంచానికి గుర్తుచేస్తూ ఈ దినోత్సవం కొనసాగుతోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in